పదేండ్ల పాటు రెప్పపాటు కూడా కరెంటు పోనియ్యలే.. అప్పడెట్లుండే పాలన..గిప్పడెట్లుందంటూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలను అడిగే తెలుసుకున్నారు. శనివారం షాపూర్‌నగర్ మార్కెట్లో ప్రజలను పలకరించారు. బీఆర్ఎస్ పాలనలో ఎలా ఉండే..ఇప్పడు ఎలా ఉంటున్నదని.. అక్కడున్న వారిని అడగ్గా..అప్పడే బాగుండేదని, ఇప్పడు అంతా ఆగంలో ఉందన్నారు. అక్కడున్న యువకులు కేటీఆర్‌తో సెల్ఫీ దిగేందుకు పోటీ పడ్డారు.

-జీడిమెట్ల

నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, ఆదివారం 4 ఫిబ్రవరి 2024 | HYDERABAD

కూకట్‌పల్లి సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కరెంటు పోతే

కాంగ్రెస్‌నే తల్చుకుంటుండ్రు

కాంగ్రెస్ పాలనలో చీకటి రోజులే

కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మేడ్చల్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): 'మహిళా సోదరి మణులు ఎదురు చూస్తున్నారు.. మహాలక్ష్మి పథకం ఎప్పుడా అని...2500 ఎప్పుడు వస్తాయని.. గ్యారంటీ కార్డులు ఎక్కడా అని...వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేసి తీరాలి.. లేదంటే ఆ తర్వాత బొంద తవ్వడం ఖాయం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని సీఎం, డిప్యూటీ సీఎంలు సంతకాలు చేశారన్నారు. మార్చి 17 వరకు ఓపికగా ఉంటామని, వంద రోజులు పూర్తయిన తర్వాత ప్రజల పక్షాన పోరాడుతామని కేటీఆర్ హెచ్చరించారు. దేశంలోనే తలసరి ఆదాయంలో నంబర్-1 రాష్ట్రంగా తీర్చిదిద్ది కాంగ్రెస్‌కు బంగారు పల్లాన్ని అప్ప చెప్పామని, కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లంకె బిందెలు లేవు.. ఖాళీ కుండలే అని మాట్లాడడం ఆ స్థాయికి తగదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే సమర్థత లేక ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మార్చి 17 తర్వాత సమాధానం చెబుతామని హెచ్చరించారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ వస్తేనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని, కాంగ్రెస్‌కు ఓటేయ్యాలని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. దివాలకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు. గ్రేటర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలు గెలిపించిన ఉత్సాహంతోనే వచ్చే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. సన్నాహక సమావేశాల్లో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరితమైన హామీలు నమ్మి.. గ్రామీణ ప్రజలు ఆ పార్టీకి ఓట్లు వేశారు. హైదరాబాద్‌లో పదేండ్లలో ఎన్నడూ కరెంటు పోలేదు. కానీ ఇప్పడు చిన్నబర్తిడే పార్టీలో కూడా అర గంట కరెంటు పోతే పిల్లలు కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటున్నారు. 60 రోజుల్లో నే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుంది.కాంగ్రెస్ పాలన చూస్తేనే.. బీఆర్ఎస్ పాలన ప్రజలకు తెలుస్తుంది.

మళ్లీ కేసీఆర్ రావాలె..

కరెంట్ పోతున్నది.. నీళ్లు సక్కగా వస్తలేవు.. ముస లోళ్లకు పింఛన్ కూడా సక్కగా వస్తలేదు.. ఇప్పడంతా గోసకే వచ్చింది...ఆగమాగమైంది.. ఇప్పడే కేసీఆర్ రావాలె.. ఇప్పడున్న ముఖ్యమంత్రి వద్దు' అని కుత్బుల్లాపూర్‌కు చెందిన లక్ష్మమ్మ తన ఆవేదనను వ్యక్త పరిచారు. దీంతో ఆమెను కేటీఆర్ వేదికపైకి పిలు పించి మాట్లాడించారు. ఇప్పుడే కేసీఆర్ రావాలె.. ఇప్పుడున్న ముఖ్యమంత్రి వద్దు అని చెబితే.. ఇప్పుడు ఏం చేయలేమని ఐదేండ్ల వరకు ఆగాలని కేటీఆర్ సర్ది చెప్పారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం..

విజయోత్సవ సభ

హాజరుకానున్న కేటీఆర్

ఉప్పల్/నేరేడ్‌మెట్: ఉప్పల్ నియోజకవర్గ విజయోత్సవ సభను మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే మల్కాజిగిరి నియోజకవర్గంలోని గౌతంనగర్ డివిజన్ శ్రీ లక్ష్మీ గార్డెన్స్‌లో జరిగే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కుత్బుల్లాపూర్ సభలో ఖడ్గం ఎత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

76 కిలోల చింతకాయలతో..

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 2: ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన శ్రీవారికి శనివారం సుమారు 76 కిలోల చింతకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి.. స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అర్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులు, తులసి వెంకట రమణాచార్యులు తెలిపారు.



9 నుంచి బుక్ ఫెయిర్

హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ బుక్ ఫెయిర్(36వ జాతీయ పుస్తక ప్రదర్శన)ను ఈ నెల 9 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో బుక్ ఫెయిర్ నిర్వహించేందుకు వేదికలు దొరకని దుస్థితి ఉండేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ తోడ్పాటుతో బుక్ ఫెయిర్ ఓ పండుగలా నిర్వహించగలిగామని చెప్పారు. అతి ఖరీదైన ఎన్టీఆర్ స్టేడియం వంటి ప్రాంతాన్ని పుస్తక పండుగ కోసం ఉచితంగా అందించిన ఘనత కేసీఆర్ సర్కార్‌దేనని వివరించారు. ఈ సారి బుక్ ఫెయిర్ ప్రాంగణానికి ప్రజా గాయకుడు గద్దర్ పేరును పెట్టినట్లు తెలిపారు. అలాగే బుక్ ఫెయిర్ వేదికకు సంస్కృత పండితుడు, ద్రవిడ యూనివర్సిటీకి వీసీగా ఉన్న దివంగత రవ్వా శ్రీహరి పేరును నామకరణం చేసినట్లు చెప్పారు. ప్రారంభోత్సవం రోజున ప్రధాన వేదిక వద్ద అమర వీరుల స్థూపం ఏర్పాటు చేసి అమరులకు నివాళులర్పిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బుక్ ఫెయిర్ నిర్వహణకు అన్ని విధాలా సహకరిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ స్టేడియం వేదికగా కొలువుదీరబోతున్న బుక్ ఫెయిర్‌లో 365 స్టాల్స్ ఉండబోతున్నాయి. ఇందులో తెలుగు సాహిత్యానికి సంబంధించి 184 స్టాల్స్ ఉండగా, ఆంగ్ల సాహిత్యానికి 144 స్టాల్స్, పిల్లల కోసం 18 స్టాల్స్, ప్రభుత్వం సమాచార స్టాల్స్ 7, మీడియా రంగ సంస్థలు-15 స్టాల్స్‌తో పాటు ఇతర స్టాల్స్ ఉంటాయని హెచ్‌బీఎఫ్ సెక్రటరీ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. హెచ్‌బీఎఫ్ వైస్ ప్రెసిడెంట్ కోయ చంద్రమోహన్, హెచ్‌బీఎఫ్ ఫౌండర్ రాజేశ్వర్‌రావు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి వాసు, జాయింట్ సెక్రటరీ శోభన్ బాబు, వైస్ ప్రెసిడెంట్ నారాయణ రెడ్డి, కవి యాకూబ్, కార్యవర్గ సభ్యులు సూరిబాబు, శ్రీకాంత్, బాల్ రెడ్డి, మెంబర్ జనార్దన్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

hmda
Growing Global

ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా..

సిటీబ్యూరో: హెచ్ఎండీఏ కార్యకలాపాలపై కమిషనర్ దాన కిశోర్ శనివారం సమీక్ష చేశారు. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా పనిచేస్తున్న హెచ్ఎండీఏ పరిధిలోని ప్రతి విభాగం పనితీరును ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అత్యంత కీలకమైన ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలపై ఉన్నతాధికారులతో వేర్వేరుగా మాట్లాడారు. ప్లానింగ్ విభాగం డైరెక్టర్లు విద్యాధర్, శ్రీనివాస్ భవన నిర్మాణం, లేఅవుట్‌ల అనుమతుల వివరాలను, క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను వివరించారు.

మాట్లాడుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్

బల్దియా బడ్జెట్‌కు.. రూట్ క్లియర్ చేయండి

సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

స్టాండింగ్ కౌన్సిల్ కమిటీల ఏర్పాటు, సర్వసభ్య సమావేశంపైనా చర్చ

కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు ఫోన్ చేసిన ముఖ్యమంత్రి

బల్దియా అంశాలే తప్ప.. రాజకీయ ప్రాధాన్యత లేదన్న మేయర్

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా ఐదు నెలల పాటు వాయిదాపడిన బల్దియాలోని అనేక అంశాలు వెంటనే ముందుకు తీసుకెళ్లేలా.. తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. శనివారం సీఎంను ఆయన నివాసంలో కలిసిన మేయర్.. జీహెచ్ఎంసీ బడ్జెట్‌ను వెంటనే ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమం చేయాలన్నారు. దీంతో పాటు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న స్టాండింగ్ కౌన్సిల్ కమిటీల ఏర్పాటు, బల్దియా సర్వసభ్య సమావేశం నిర్వహణపైనా కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ పరిపాలన సజావుగా సాగడంతో పాటు రాష్ట్ర రాజధానికి అత్యంత కీలకమైన బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమం అయ్యేలా సర్వ సభ్య సమావేశాన్ని నేరుగా నిర్వహించేలా జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలని మేయర్ కోరారు.

కోడ్ అమల్లోకి వస్తే..మరింత జాప్యం

పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే మరింత కాలం పలు అంశాలు పెండింగ్‌లో పడతాయని మేయర్, సీఎం దృష్టికి తెచ్చారు. బల్దియా బడ్జెట్ ఆలస్యం కావడంతో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నిధుల కేటాయింపు వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కార్పొరేటర్ల నుంచి స్టాండింగ్ కౌన్సిల్ కమిటీల ఏర్పాటుకు తీవ్రమైన ఒత్తిడి ఉందన్నారు. మేయర్ తన దృష్టికి తెచ్చిన అన్ని అంశాలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి.. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో వివిధ అంశాలపై ఫోన్‌లో మాట్లాడారు. జీహెచ్ఎంసీ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదివారం బల్దియా అంశాలపై సమావేశం నిర్వహించేందుకు సీఎం నిర్ణయించినట్లు తెలిసింది. కాగా, కేవలం పరిపాలనపరమైన అంశాలు, మున్సిపల్ శాఖకు బాధ్యత వహిస్తున్నది సీఎం కావడం, అన్నింటికంటే ముఖ్యంగా పార్లమెంటు ఎన్నికల్ కోడ్ రాకముందే జీహెచ్ఎంసీ బడ్జెట్‌ను ఆమోదించుకోవాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రిని కలిసినట్లు మేయర్ విజయలక్ష్మి తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలేదని, కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తానని, ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు.

పాటిగడ్డలో కలెక్టరేట్?

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : పాటిగడ్డలో హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టరేట్ భవనాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. రాష్ట్ర సచివాలయంలోని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరయ్యారు. పాటిగడ్డలో కలెక్టరేట్ భవన నిర్మాణానికి ప్రతిపాదించిన కలెక్టర్.. దాదాపు పదమూడు ఎకరాల స్థలం అవసరమని చెప్పారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో 39 డిపార్ట్‌మెంట్లు పని చేస్తున్నాయి. వాటిలో కేవలం ఏడు మాత్రమే కలెక్టరేట్‌లో కొనసాగుతున్నాయి. మిగితా 32 శాఖలన్నీ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని కలెక్టర్ మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి.. జిల్లా కలెక్టరేట్ నూతన భవన నిర్మాణం అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

కాంట్రవర్సీ కమిషనర్..!

వివాదాస్పదమవుతున్న రోనాల్డ్ రాస్ వ్యవహార శైలి

సీఎం రేవంత్‌ను కలిసి కమిషనర్‌కు చెక్ పెట్టిన మేయర్ విజయలక్ష్మి

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్ వ్యవహార శైలి వివాదాస్పదమవుతున్నది. ముఖ్యంగా మేయర్, కార్పొరేటర్లను ఏ మాత్రం పట్టించుకోకుండా అంతా తానై అన్నట్లు నిర్ణయాలు తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది.. నిబంధనల ప్రకారం కాలానుగుణంగా చేపట్టాల్సిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలను సైతం నిర్వహించకుండా... చివరకు బల్దియా బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సైతం చర్యలు తీసుకోలేదు. కార్పొరేటర్ల ఒత్తిడితో మేయర్ లేఖ రాసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కావాలంటూ.. కారణం చూపి వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మేయర్ విజయలక్ష్మి నేరుగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విషయం చెప్పడంతో కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలకు చెక్ పెట్టినట్లయింది.

ప్రజాప్రతినిధులను విస్మరిస్తూ..

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ కొంతకాలంగా ప్రజాప్రతినిధులను విస్మరిస్తూ పాలనా వ్యవహారాలను నిర్వహిస్తున్నట్లుగా భారీ ఎత్తున విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. వాస్తవానికి గ్రేటర్ గత స్టాండింగ్ కమిటీ గడువు గతేడాది అక్టోబరులోనే ముగిసింది. దీంతో కమిషనర్ నవంబరులో నోటిఫికేషన్ జారీ ఎన్నిక ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అది సాధ్యం కాలేదు. ఎన్నికల తర్వాత గత ఏడాది డిసెంబర్ 3న ఎన్నికల్ కోడ్ ముగిసింది. కానీ ఇప్పటివరకు అంటే దాదాపు రెండు నెలల పాటు ఆ ప్రక్రియనే చేపట్టలేదు. స్టాండింగ్ కమిటీ ఏర్పాటు కాకపోవడంతో నగరాభివృద్ధికి సంబంధించిన అనేక పనులు, నిర్ణయాలు పెండింగ్‌లో పడ్డాయి. కాగా, స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ కార్పొరేటర్ హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నిధులూ మళ్లింపు..

కేసీఆర్ ప్రభుత్వం నిర్మించి, పేదలకు పంపిణీ చేసిన డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. జీహెచ్ఎంసీ దగ్గర నిధులు లేకపోవడంతో కేసీఆర్ ప్రభుత్వం గతంలోనే హెచ్ఎండీఏ నుంచి రూ.100 కోట్ల నిధుల్ని బల్దియాకు ఇప్పించింది. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. అయితే ఆ నిధులను మౌలిక వసతుల కల్పనకు ఇవ్వకుండా కమిషనర్ మళ్లించారు.

నిబంధనల ప్రకారం..

నిబంధనల ప్రకారం బల్దియా బడ్జెట్‌ను తొలుత స్టాండింగ్ కమిటీ ఆమోదించిన తర్వాత కౌన్సిల్ మీటింగ్‌లో ప్రవేశపెట్టి ఆమోదం అనంతరం ప్రభుత్వ ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. కానీ గ్రేటర్ చరిత్రలో ఎన్నడూలేని విధంగా బల్దియా బడ్జెట్‌ను నేరుగా ప్రభుత్వానికి పంపి ఆమోదింపజేసుకునేందుకు కమిషనర్ ప్రయత్నాలు చేస్తున్నారనే వార్తలు కూడా వచ్చాయి. అయితే వీటన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదంటూ కమిషనర్ వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ విజయలక్ష్మి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అసలు విషయాన్ని బయటపెట్టినట్లు తెలిసింది. మీరే అపమన్నందునే కమిషనర్ ఆపుతున్నారట' అని మేయర్ కుండబద్దలు కొట్టడంతో ముఖ్యమంత్రి బల్దియాలో సాధారణంగా జరగాల్సిన ప్రక్రియల్ని తానెందుకు ఆపమంటానని బదులిచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయం తెలియడంతోనే సీఎం రేవంత్ నేరుగా కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో ఫోన్‌లో మాట్లాడి.. ఆదివారం సమావేశానికి రావాలని ఆదేశించినట్లు చెబుతున్నారు.